

ఇంటింటి ప్రచారంలో భాగంగా అన్నానగర్‌లో వృద్ధురాలికి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత

**వృద్ధులకు అండగా బీఆర్‌ఎస్**



బాలంరాయిలో చేపట్టిన ప్రచారంలో భాగంగా వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత

# బీఆర్‌ఎస్‌కు బలం, బలగం..మీరే

**మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి ● మూడో వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించిన అభ్యర్థి లాస్యనందిత**

కంటోన్మెంట్, నవంబర్ 16: 'మీ ఇంటి బిడ్డగా వస్తున్నా. నన్ను ఆశీర్వదించండి. అధిక మెజార్టీతో గెలిపించండి' అని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి గ్యాని లాస్యనందిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం ఆమె మూడో వార్డు అన్నానగర్, బాలంరాయిల్లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. మూడో వార్డులో లాస్యనందితకు ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్ ఆధ్వర్యంలో బాలంరాయి, అన్నానగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లిన లాస్యనందితకి మహిళలు ఎదురొచ్చి బొట్టుపెట్టి మంగళహారతులతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. మరోపక్క అభివృద్ధికి సంబంధించిన ప్లకార్డులతో ప్రజలు హాజరయ్యారు. కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని విధంగా దివంగత ఎమ్మెల్యే సాయన్న అభివృద్ధి చేసినట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మరోసారి గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలు బాగుపడాలంటే మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. మూడోసారి అధికారంలోకి వస్తే పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేసేలా సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారని చెప్పారు. రూ.10వేల నుంచి రూ.16వేల వరకు రైతుబంధు పెంచుతారని, రూ.1,250 ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే అందించేలా మ్యానిఫెస్టోలో పొందుపరిచామన్నారు.



అన్నానగర్‌లో ఇంటింటి ప్రచారం సందర్భంగా మహిళను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత



గడపగడపకు ప్రచారంలో భాగంగా అన్నానగర్‌లో కారు గుర్తుకే ఓటు వేయాలని మహిళను కోరుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత




ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందితను ఆశీర్వదిస్తున్న ఓ వృద్ధుడు



అన్నానగర్‌లో నిర్వహించిన లాస్యనందిత పాదయాత్రకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మహిళలు





అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత హామీ ఇచ్చారు. గురువారం బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని నియోజకవర్గ ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. – కంటోన్మెంట్

## బీఆర్‌ఎస్ అభ్యర్థికి వికాస్ మంచ్ మద్దతు



మంత్రి తలసానికి కంటోన్మెంట్ మ్యానిఫెస్టోను అందజేస్తూ మద్దతు పలుకుతున్న వికాస్‌మంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎబెల్, సంకి రవీందర్‌లు

కంటోన్మెంట్, నవంబర్ 16: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనానికి బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందితకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎబెల్, సంకి రవీందర్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ సమావేశానికి హాజరైన మంత్రి తలసానికి కంటోన్మెంట్ మ్యానిఫెస్టోను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలీన వ్యతిరేక పార్టీల ఓటమే లక్ష్యంగా వికాస్ మంచ్ పని చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా కంటోన్మెంట్‌లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా, కేంద్ర సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తుందని మండిపడ్డారు. విలీన ప్రక్రియకు దివంగత ఎమ్మెల్యే సాయన్న సైతం అండగా నిలిచారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర సర్కారు సైతం కంటోన్మెంట్ విలీనానికి సుముఖంగా ఉన్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

## బీసీఏ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్, ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 21 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.